క్లుప్తంగా

కొనసాగుతున్న బ్రహ్మోత్సవాలు


హోమం నిర్వహిస్తున్న భక్తులు

కడ్తాల్: మండల కేంద్రంలోని శ్రీ సీతారామాలయంలో శ్రీ విజయ గణపతి, శ్రీజ్ఞాన సరస్వతి, శ్రీ సీతారామచంద్ర స్వామి వార్షిక బ్రహ్మోత్సవాలు వైభవంగా కొనసాగుతున్నాయి. ఉత్సవాల్లో భాగంగా రెండో రోజు గురువారం అంగడి మఠం భువనేశ్వర్ స్వామి, జ్ఞానేశ్వర శాస్త్రి, హరీశ్‌ల ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు, అర్చనలు, మంటపారాధన, అభిషేకం, హోమ పూజలు అత్యంత భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. కార్యక్రమంలో ఆలయ నిర్మాణ దాతలు బస్వరాజ్ రాజమణి దంపతులు, నాయకులు సంతోష్, మల్లేశ్ తదితరులు పాల్గొన్నారు.

పేదలపై గుది'బండ'

వంట గ్యాస్ ధరను తగ్గించాలి: సీపీఎం


నిరసన తెలుపుతున్న సీపీఎం నాయకులు

మాడ్గుల: కేంద్ర ప్రభుత్వం పెంచిన వంట గ్యాస్ ధర.. పేద ప్రజలకు భారంగా మారిందని సీపీఎం మండల కార్యదర్శి రమేష్ అన్నారు. మండలంలోని నాగిళ్ల గ్రామం, మండల కేంద్రంలోని చౌరస్తాలో గురువారం ఆ పార్టీ శ్రేణులు ర్యాలీ, నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం వచ్చిన తర్వాతే.. పేదల బతుకులు ఆగమవుతున్నాయని ఆరోపించారు. నిత్యావసర సరుకుల ధరలను పెంచుతూ.. సామాన్యులను ఆగం చేస్తుందని విమర్శించారు. పెంచిన గ్యాస్ ధరను వెంటనే తగ్గించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో కార్యవర్గ సభ్యుడు అంజయ్య, నాయకులు చంద్రయ్య, శివ, మహేశ్ పాల్గొన్నారు.

బీజేపీ ఆవిర్భావ దినోత్సవం


చింతలపల్లిలో పార్టీ జెండాను ఆవిష్కరిస్తున్న కమలనాథులు

ఆమనగల్లు: ఆమనగల్లు మండలంలోని పోలెపల్లి, సింగంపల్లి, మాలెపల్లి, చింతలపల్లి గ్రామాల్లో గురువారం బీజేపీ ఆవిర్భావ దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పార్టీ శ్రేణులు కాషాయ జెండాలను ఆవిష్కరించారు. బీజేపీ మండల అధ్యక్షుడు శ్రీనివాస్, మండల మాజీ అధ్యక్షుడు లక్ష్మణ్‌రావ్, కల్వకుర్తి కో కన్వీనర్ గోరటి నర్సింహ, మండల ప్రధాన కార్యదర్శి మల్లేశ్, కిసాన్‌మోర్చా అధ్యక్షుడు భగవాన్‌రెడ్డి, ఎస్సీ మోర్చా అధ్యక్షుడు వెంకటయ్య పాల్గొన్నారు.

పీఆర్‌టీయూ గుర్తింపు కార్డులు అందజేత


గుర్తింపు కార్డులు అందజేస్తున్న పరమేష్

ఇబ్రహీంపట్నం రూరల్: ఉపాధ్యాయుల సమస్యలపై నిరంతరం పోరాటం చేసే సంఘం పీఆర్‌టీయూ అని ఆ సంఘం ఇబ్రహీంపట్నం మండల శాఖ అధ్యక్షుడు వర్కాల పరమేష్ పేర్కొన్నారు. ఆదిబట్ల మున్సిపాలిటీ పరిధి కొంగరకలాన్ జెడ్పీహెచ్‌ఎస్ పాఠశాల ఉపాధ్యాయులకు గురువారం సంఘం గుర్తింపు కార్డులు అందజేశారు. జీహెచ్‌ఎం రాజేశ్వర్ రెడ్డి, జిల్లా బాధ్యులు రాములు, రామచంద్రయ్య, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

నూతన సీఐగా బాధ్యతలు స్వీకరణ


జానకిరామ్‌రెడ్డి

ఆమనగల్లు: ఆమనగల్లు సర్కిల్ ఇన్‌స్పెక్టర్‌గా వి.జానకిరామ్ రెడ్డి గురువారం బాధ్యతలు చేపట్టారు. ఇప్పటి వరకు ఇక్కడ సీఐగా పనిచేసిన ప్రమోద్‌కుమార్.. శంషాబాద్ అంతర్జాతీయ విమానాశ్రయం ట్రాఫిక్ ఠాణా సీఐగా బదిలీకాగా, ఏసీబీలో పనిచేస్తున్న జానకిరామ్‌రెడ్డి ఆమనగల్లుకు నియమితులయ్యారు. ఈ సందర్భంగా సీఐని.. ఎస్‌ఐ వెంకటేశ్ మర్యాదపూర్వకంగా కలిశారు. అనంతరం సీఐ మాట్లాడుతూ.. శాంతిభద్రతల పరిరక్షణకు ప్రజలు సహకరించాలని కోరారు.

ఉన్నవి పెరగవు.. కొత్తవి రావు!

ఆసరా పింఛన్ల కోసం అర్హులు ఎదురు చూస్తున్నారు. పాత లబ్ధిదారుల ఆసరా పెంచడంతో పాటు.. కొత్తవారికి అందచేస్తామని ఎన్నికల్లో ప్రభుత్వం హామీ ఇచ్చింది. కానీ.. నేటి వరకు పింఛన్ల ఊసు ఎత్తకపోవడంతో వృద్ధులు, దివ్యాంగులు, వితంతువులు, ఒంటరి మహిళలు ఆందోళన చెందుతున్నారు.

- పల్లెల్లో పింఛన్ పరేషాన్
- ఆసరా కోసం అర్హుల ఎదురు చూపు
- వందల్లో కొత్త దరఖాస్తులు
- పట్టించుకోని అధికార యంత్రాంగం



మంచాల: ఆసరా పింఛన్లు అందించి ఆదుకుంటామని చెప్పిన పాలకులు ఏళ్లు గడిచినా ఇవ్వటం లేదని అర్హులు ఆందోళన వ్యక్తంచేస్తున్నారు. మంచాల మండల కార్యాలయంలో కొత్తగా పింఛన్ల కోసం వృద్ధులు 30, వికలాంగులు 50, వితంతువులు 94, గీత కార్మికులు 7 మంది దరఖాస్తు చేసుకున్నారు. అంతే కాకుండా మండల పరిధి 23 గ్రామాల్లో లోయపల్లిలో 70, ఆరుట్లలో 100 వరకు దరఖాస్తులు అందాయి. ఇలా మండలంలో మొత్తం 350కు పైగా దరఖాస్తులు వచ్చాయి. కొత్త వాటితో పాటు పాతవి అనేక ఉన్నాయి. గత ప్రభుత్వ హయాంలో కొత్త పింఛన్లు రాలేదు. ప్రస్తుత ప్రభుత్వం పాత లబ్ధిదారులకు పింఛన్ పెంచడంతో పాటు, కొత్త వారికి ఇస్తామని ఎన్నికల్లో హామీ ఇచ్చింది. కానీ కాంగ్రెస్ సర్కార్ కొలువుదీరి ఏడాదిన్నర కాలం గడుస్తున్నప్పటికీ.. హామీ జాడ కానరావటం లేదని పలువురు ఆందోళన వ్యక్తంచేస్తున్నారు.

సైట్ ఆన్ కాగానే..

గత బీఆర్‌ఎస్ ప్రభుత్వం ఆసరా పింఛన్లు వికలాంగులకు రూ.4 వేలు, వృద్ధులు, ఒంటరి మహిళలు, వితంతువులకు రూ.2 వేలు ఇచ్చేది. ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల మేనిఫెస్టోలో వికలాంగులకు రూ.6 వేల16, వృద్ధులు, ఒంటరి మహిళలు, వితంతువులకు రూ.4 వేల 16 ఇస్తామని ప్రకటించింది. బహిరంగ సభల్లో డిసెంబర్ నెల నుంచే పెంచిన పింఛన్లు అమలు చేస్తామని పేర్కొంది. కానీ ఆచరణలో విస్మరించింది. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి పింఛన్లు ఇచ్చి ఆదుకోవాలని అర్హులు కోరుతున్నారు. ఇదే విషయంపై ఎంపీడీఓ బాలశంకర్‌ను వివరణ కోరగా.. కొత్తగా పింఛన్లకు దరఖాస్తులు స్వీకరిస్తున్నాం. సైట్ ఆన్ కాగానే అర్హులకు అందేలా నమోదు ప్రక్రియ మొదలు పెడతామని పేర్కొన్నారు.

కాలు కొట్టేశారు..



అనారోగ్యం కారణంగా కుడి కాలు తొలగించారు. పింఛన్ కోసం దరఖాస్తు పెట్టుకున్నాను. రెండేళ్లు అయింది. ఇప్పటి వరకు రాలేదు. కుటుంబ పోషణే కాదు, అనారోగ్య కారణాలు వెంటాడుతున్నాయి. కనీసం మందులు కొనుక్కోలేని దుస్థితి. అధికారులు స్పందించి ఆదుకోవాలి.

– బూర వెంకటేశ్, లింగంపల్లి

ఇల్లు గడవడం కష్టంగా ఉంది



నా భర్త అనారోగ్యంతో చనిపోయాడు. నాకు ముగ్గురు పిల్లలు. చిన్న పిల్లలతో ఇల్లు గడవడం కష్టంగా ఉంది. ఏడాది క్రితం వితంతువు పింఛన్ కోసం దరఖాస్తు చేసుకున్నాను. ఇప్పటి వరకు రాలేదు. అధికారులు స్పందించి.. ఆసరా ఇచ్చి ఆదుకోవాలి.

– కొల్లోజు రజిత, ఆరుట్ల

ప్రభుత్వ నిర్లక్ష్యం



ఆసరా పింఛన్ల విషయంలో ప్రభుత్వం నిర్లక్ష్య ధోరణి వీడాలి. ఎన్నికల్లో ఇచ్చిన హామీని నిలబెట్టుకోవాలి. ఇప్పటికీ కొత్త పింఛన్లు లేవు. పాత పింఛన్లు సక్రమంగా ఇవ్వడం లేదు. నెలనెలా ఆసరా ఇచ్చి, వికలాంగులు, వితంతువులు, ఒంటరి మహిళలు, వృద్ధులను ఆదుకోవాలి.

– కాశ్ల జంగయ్య, వికలాంగుల హక్కుల పోరాట సమితి రాష్ట్ర అధ్యక్షుడు

ప్రజా సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

- అర్హులందరికీ ఆరు గ్యారంటీలు అందజేస్తాం
- ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి


సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి

తుర్కయంజాల్: ప్రజా సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయమని, అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలను అందించడమే తమ లక్ష్యమని ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి అన్నారు. గురువారం తుర్కయంజాల్‌లోని ఓ ఫంక్షన్ హాల్‌లో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఆరు గ్యారంటీలు అర్హులకు అందాలని, ఇందిరమ్మ ఇళ్లు, రాజీవ్ యువ వికాసం, గృహజ్యోతి, రేషన్ కార్డుల అర్హుల ఎంపికకు వార్డుల వారీగా అధికారులు, ఇందిరమ్మ కమిటీ సభ్యులు సమన్వయం చేసుకోవాలని సూచించారు. ప్రభుత్వ పథకాలను అమలు చేయాల్సిన బాధ్యత అధికారులదేనని స్పష్టం చేశారు. లేని పక్షంలో చర్యలు తప్పవన్నారు. కొహెడలో నెలకొన్న నీటి సమస్యను వెంటనే పరిష్కరించాలని, ఎండాకాలం ముగిసే వరకు పురపాలక సంఘం పరిధిలోని ప్రతి ఇంటికి సరిపడా నీటిని సరఫరా చేయాలని ఆదేశించారు. కార్యక్రమంలో తహసీల్దార్ సుదర్శన్ రెడ్డి, మున్సిపల్ కమిషనర్ కె.అమరేందర్ రెడ్డి, హెచ్‌ఎండబ్ల్యూఎస్ జీఎం శ్రీనివాస్ రెడ్డి, పలు శాఖల అధికారులు పాల్గొన్నారు.

నూతన కమిటీ నియామకం


నియామక పత్రాలతో కమిటీ సభ్యులు తదితరులు

కడ్తాల్: పూసల కులస్తులు అన్ని రంగాల్లో వెనుకబడి ఉన్నారని, సమస్యల పరిష్కారం కోసం ఐకమత్యంతో ముందుకు సాగాలని ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు నూతనగంటి సదానందం పిలుపునిచ్చారు. గురువారం మండల పరిధి కర్కల్‌పహాడ్ గ్రామంలో రాష్ట్ర ఎన్నికల సభ్యులు బత్తుల శ్రీహరి, శేని నాగరాజు, సంఘం జిల్లా అధ్యక్షుడు ఆధ్వర్యంలో సంఘం మండల నూతన కమిటీని ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా పసుపులేటి వెంకటేశ్, గౌరవ అధ్యక్షుడిగా వెంకటయ్య, ఉపాధ్యక్షురాలిగా తిరుపతమ్మ, ప్రధాన కార్యదర్శిగా లక్ష్మణ్, కోశాధికారిగా శ్రీనివాస్, సంయుక్త కార్యదర్శిగా రమేశ్‌లను నియమించారు. అనంతరం కమిటీ సభ్యులను సన్మానించారు. కార్యక్రమంలో జిల్లా అసోసియేషన్ అధ్యక్షుడు పురుషోత్తం, జిల్లా నాయకులు భాస్కర్, నాయకులు పన్నీరు వెంకటేశం, నారాయణ, కోటయ్య, పోలేపల్లి వెంకటేశం, సోమమ్మ, మంగమ్మ, పద్మ, లక్ష్మి, కృష్ణవేణి, జ్యోతమ్మ, భూలక్ష్మి, సరితా, గీత, బాలమ్మ, శివలీల, స్వరూప, శ్రీలత, విజయ, జ్యోతి, రాము, దానయ్య, శ్రీను, కోటయ్య, లచ్చాలు, శ్రీశైలం తదితరులు పాల్గొన్నారు.

'ఫార్మా' బాధితుల సమస్యలపై పోరాటం

- రైతులతో త్వరలో ముఖ్యమంత్రిని కలుస్తాం
- సీపీఎం రాష్ట్ర కార్యదర్శి జాన్‌వేస్లీ


సమావేశంలో మాట్లాడుతున్న జాన్‌వేస్లీ

యాచారం: ఫార్మాసిటీ భూ బాధిత రైతుల సమస్యల పరిష్కారానికి పోరాటం చేస్తామని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి జాన్‌వేస్లీ అన్నారు. ఇదే విషయమై త్వరలో రైతులతో కలిసి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని కలుస్తామని పేర్కొన్నారు. నగరంలోని పార్టీ రాష్ట్ర కార్యాలయంలో గురువారం యాచారం, కందుకూరు మండలాల నాయకులు, రైతులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. కోర్టు ఆదేశాలు ఉన్న రైతుల వ్యవసాయ భూములను నిషేధిత జాబితా నుంచి తొలగించాలని కోరారు. ఫార్మాకు భూములు ఇచ్చిన రైతులకు 121 గజాల చొప్పున స్థలాలు ఇచ్చినట్లే ఇచ్చి, నేటి వరకు వాటికి కబ్జా చూపించలేదని పేర్కొన్నారు. వెంటనే కబ్జా చూపించి, రిజిస్ట్రేషన్లు చేయించాలని సూచించారు. అర్హులైన అసైన్డ్‌దారులకు పరిహారం అందజేయాలని, వ్యవసాయ కూలీలకు పునరావస ప్యాకేజీ అందజేయాలన్నారు. భూములు కోల్పోయిన కుటుంబాల్లో ఒకరికి ప్రభుత్వ ఉద్యోగం కల్పించాలని, పీఓటీ కింద పెండింగ్‌లో ఉన్న వ్యవసాయ భూములకు వెంటనే పరిహారం అందజేయాలని డిమాండ్ చేశారు. పార్టీ కంట్రోల్ కమిషన్ చైర్మన్ డీజీ నర్సింహారావు, జిల్లా కార్యదర్శి పగడాల యాదయ్య, యాచారం, కందుకూరు మండలాల కార్యదర్శులు ఆలంపల్లి నర్సింహ, బుట్టి బాలరాజులు పాల్గొన్నారు.

రాజ్యాంగ స్ఫూర్తిని దెబ్బతీస్తున్న కేంద్రం


ప్రతిజ్ఞ చేస్తున్న వంశీచంద్ రెడ్డి, ఎమ్మెల్యే కసిరెడ్డి, కాంగ్రెస్ నాయకులు

- రాజకీయ మనుగడ కోసం విద్వేషాలను రెచ్చగొడుతున్న బీజేపీ
- కాంగ్రెస్ ఆధ్వర్యంలో రాజ్యాంగ పరిరక్షణకు పాదయాత్ర
- సీడబ్ల్యూసీ ప్రత్యేక ఆహ్వానితుడు వంశీచంద్ రెడ్డి

ఆమనగల్లు: 'కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం రాజ్యాంగ స్ఫూర్తిని దెబ్బతీస్తోంది. ప్రజాస్వామ్య విలువలు కాలరాస్తూ.. రాజకీయ మనుగడ కోసం విద్వేషాలను రెచ్చగొడుతుంది' అని సీడబ్ల్యూసీ ప్రత్యేక ఆహ్వానితుడు, జై బాపు, జైభీమ్, జై సంవిధాన్ అభియాన్ రాష్ట్ర కోఆర్డినేటర్ చల్లా వంశీచంద్‌రెడ్డి ఆరోపించారు. మహాత్ముడి స్ఫూర్తిగా, అంబేడ్కర్ ఆశయాలను అమలుచేస్తూ రాజ్యాంగాన్ని కాపాడుకోవడానికి కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో జై సంవిదాన్ కార్యక్రమం నిర్వహిస్తున్నామని ఆయన చెప్పారు. ఇందులో భాగంగా పాదయాత్ర నిర్వహిస్తున్నామని వెల్లడించారు. గురువారం పట్టణంలోని ఓ గార్డెన్‌లో పార్టీ కల్వకుర్తి అసెంబ్లీ నియోజకవర్గ స్థాయి సన్నాహక సమావేశం పీసీసీ సభ్యుడు అయిల శ్రీనివాస్‌గౌడ్ అధ్యక్షతన నిర్వహించారు. ముఖ్య అతిథులుగా చల్లాతో పాటు ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి, ఎంబీసీ కార్పొరేషన్ చైర్మన్ జైపాల్, పార్టీ మండలాల ఇన్‌చార్జిలు జంగారెడ్డి, కొత్తకుర్మ శివకుమార్‌లు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వంశీ మాట్లాడారు.

ఏడాది పొడవునా జై సంవిదాన్..

పార్టీ అధిష్టానం పిలుపు మేరకు ఏడాది పొడవునా జై సంవిదాన్ కార్యక్రమం నిర్వహిస్తున్నామని వంశీచంద్ రెడ్డి పేర్కొన్నారు. ఏఐసీసీ అధ్యక్షుడిగా మహాత్మాగాంధీ ఎన్నికై వందేళ్లు పూర్తవుతున్న నేపథ్యంలో ఆయన ఆశయాలను ప్రజల్లోకి తీసుకెళ్లడానికి, రాజ్యాంగం అమలుకు 75 ఏళ్లు పూర్తవుతున్న సందర్భంగా.. రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ ఆశయాలను, రాజ్యాంగ విలువలను ప్రజలకు వివరించడానికి ఈ కార్యక్రమానికి శ్రీకారం చుట్టామని వివరించారు. రాష్ట్రంలో రాజ్యాంగ పరిరక్షణ పేరుతో పాదయాత్ర చేపడుతున్నామని చెప్పారు. ఇందులో కాంగ్రెస్ ప్రభుత్వం చేపట్టిన సంక్షేమ పథకాలు ప్రజలకు వివరించాలని పార్టీ శ్రేణులకు సూచించారు. ప్రభుత్వం చేపట్టిన బీసీ కులగణన, ఎస్సీ వర్గీకరణ బిల్లుల గురించి ప్రచారం చేయాలన్నారు. స్థానిక సంస్థల ఎన్నికలకు పాదయాత్రతో సిద్ధం కావాలని చెప్పారు. పార్టీకోసం పనిచేసేవారికి స్థానిక ఎన్నికల్లో అవకాశం కల్పించాలని ఆయన సూచించారు.

రూ.500 కోట్లతో అభివృద్ధి పనులు

కల్వకుర్తి నియోజకవర్గంలో రూ.500 కోట్లతో అభివృద్ధి పనులు జరుగుతున్నాయని ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి చెప్పారు. కాంగ్రెస్ ప్రభుత్వంపై విపక్షాల నాయకులు చేస్తున్న విషప్రచారాలను తిప్పికొట్టాలని ఆయన పిలుపునిచ్చారు. సమావేశంలో పీసీబీ సభ్యుడు బాలాజీసింగ్, మార్కెట్ చైర్మన్ యాటగీత, మాజీ చైర్మన్ బట్టు కిషన్‌రెడ్డి, కల్వకుర్తి, ఆమనగల్లు బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు విజయ్‌కుమార్‌రెడ్డి, యాట నర్సింహ, పార్టీ మండలాల అధ్యక్షులు డోకూరు ప్రభాకర్‌రెడ్డి, జగన్, బిచ్యానాయక్, మోతీలాల్‌నాయక్, మానయ్య, శ్రీకాంత్‌రెడ్డి, జెడ్పీటీసీ మాజీ సభ్యులు శ్రీనివాస్‌రెడ్డి, ప్రభాకర్‌రెడ్డి, నాయకులు కేశవులు, రాములు, విజయ్‌కుమార్, ఖలీల్, వస్పుల శ్రీశైలం తదితరులు పాల్గొన్నారు.

స్థానిక ఎన్నికలకు సిద్ధంగా ఉండాలి

ఇబ్రహీంపట్నం: స్థానిక సంస్థల ఎన్నికలు ఎప్పుడొచ్చినా బీజేపీ శ్రేణులు సిద్ధంగా ఉండాలని ఆ పార్టీ రాష్ట్ర కౌన్సిల్ మెంబర్ చండి మహేందర్‌రెడ్డి పిలుపునిచ్చారు. గురువారం ఇబ్రహీంపట్నంలోని ఓ గార్డెన్‌లో పార్టీ మండల అధ్యక్షుడు గోదల శేఖర్‌రెడ్డి అధ్యక్షతన పార్టీ క్రియాశీల సభ్యుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం ప్రవేశపెట్టిన సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను ప్రజలకు వివరిస్తూ, పార్టీ అభ్యున్నతికి కృషి చేయాలని సూచించారు. కార్యక్రమంలో పార్టీ నేతలు సుధాకర్‌రెడ్డి, బోసుపల్లి ప్రతాప్, దండే శ్రీశైలం, దొండ రమణారెడ్డి, స్వామిగౌడ్, విష్ణువర్ధన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఆస్పత్రి తనిఖీ

ఇబ్రహీంపట్నం: ఇబ్రహీంపట్నంలోని విజయలక్ష్మి ఆస్పత్రిని జిల్లా వైద్యాధికారి డి. వెంకటేశ్వర్‌రావు గురువారం తనిఖీ చేశారు. పట్టణానికి చెందిన ఓ వివాహితకు ఈ ఆస్పత్రిలో ఏడాదిన్నర క్రితం కుటుంబ నియంత్రణ ఆపరేషన్ చేయగా విఫలమైంది. ఇటీవల సదరు మహిళకు ఎక్టోపిక్ ప్రెగ్నెన్సీ వచ్చి, కడుపులో నొప్పి రావడంతో మరలా అదే హాస్పిటల్‌లో చేర్పించారు. అనంతరం ఆమెకు చికిత్స అందించిన వైద్యులు.. మరోసారి కు.ని. శస్త్ర చికిత్స చేశారు. సంబంధిత చార్జిలను వేశారు. ఇదే విషయాన్ని ఆమె తరుపు బంధువులు జిల్లా వైద్యాధికారికి ఫిర్యాదు చేశారు. ఈ మేరకు ఆయన ఆస్పత్రిని తనిఖీ చేశారు. అక్కడ వైద్య సౌకర్యాలను పరిశీలించారు. కాన్పుల గదిని మరింత మెరుగుపరచాలని నిర్వాహకులను ఆదేశించారు. కు.ని ఆపరేషన్లు ఒక్కోసారి విఫలమౌతుంటాయని డీఎంహెచ్‌ఓ పేర్కొన్నారు.


ఆస్పత్రిని తనిఖీ చేస్తున్న డీఎంహెచ్‌ఓ

ఫాంపాండ్స్‌తో భూగర్భ జలాల పెంపు


కూలీలతో మాట్లాడుతున్న ఎంపీడీఓ నరేందర్‌రెడ్డి

ఎంపీడీఓ నరేందర్‌రెడ్డి

యాచారం: ఫాంపాండ్స్ పనులతో భూగర్భ జలాల పెంపునకు అవకాశం ఉంటుందని, భవిష్యత్తులో నీటి సమస్య ఉండబోదని ఎంపీడీఓ నరేందర్‌రెడ్డి పేర్కొన్నారు. మండల పరిధి మాల్ గ్రామంలో గురువారం ఉపాధిహామీ పనులను ఆయన పరిశీలించి మాట్లాడారు. వర్షాలు కురిస్తే వరద నీరు వృథాగా పోకుండా నిల్వ చేసే విధంగా ఫాంపాండ్స్‌ను తీయిస్తున్నట్లు తెలిపారు. మండల పరిధి 24 గ్రామాల్లో, మరో 15 అనుబంధ గ్రామాల్లో ఐదుకుమంచి ఫాంపాండ్స్‌ను తీయిస్తున్నట్లు పేర్కొన్నారు. కూలీలు ఉపాధి పనులను సద్వినియోగం చేసుకోవాలని, పనులు చేసిన వెంటనే వేతనాలు అందేలా కృషి చేస్తున్నామని చెప్పారు. ఎండల తీవ్రతను దృష్టిలో ఉంచుకుని, జాగ్రత్తగా ఉండాలని కూలీలకు సూచించారు. కార్యక్రమంలో ఈజీఎస్ ఏపీఓ లింగయ్య ఉన్నారు.

కాల్వను కాపాడండి


వినతిపత్రం చూపిస్తున్న రైతులు

ఆమనగల్లు: చెరువుకింది కాల్వను కొందరు కబ్జా చేసేందుకు ప్రయత్నిస్తున్నారని ఆమనగల్లు మండలం సింగంపల్లి గ్రామ రైతులు ఆరోపించారు. కాల్వను అక్రమార్కుల నుంచి కాపాడాలని కోరారు. ఈ మేరకు గురువారం పట్టణంలోని తహసీల్దార్ కార్యాలయంలో రైతులు బాలరాజు, రాములు, రాజు, శ్రీను, సాయిబాబా, సత్యనారాయణ, కృష్ణయ్య తదితరులు వినతిపత్రం అందజేశారు. అనంతరం రైతులు మాట్లాడుతూ.. గ్రామంలోని సర్వే నం.39,40,45,46లో ఉన్న చెరువు కింది భాగంలో వాగు కాల్వను కొందరు కబ్జా చేసేందుకు యత్నిస్తున్నారని పేర్కొన్నారు. దీనిని అడ్డుకున్న వారిని బెదిరిస్తున్నారని తెలిపారు. తగిన విచారణ జరిపి, కాల్వ ఆక్రమణకు గురికాకుండా చూడాలని సంబంధిత అధికారులను రైతులు కోరారు.

పేదల అభ్యున్నతే కాంగ్రెస్ లక్ష్యం


సహపంక్తి భోజనం చేస్తున్న కాంగ్రెస్ నాయకులు తదితరులు

మంచాల: బడుగు, బలహీన వర్గాల అభ్యున్నతే కాంగ్రెస్ పార్టీ లక్ష్యమని పార్టీ నాయకుడు కొంగర విష్ణు వర్ధన్‌రెడ్డి అన్నారు. గురువారం మంచాల మండలం ఆరుట్ల గ్రామంలో పార్టీ ఆధ్వర్యంలో సహపంక్తి భోజనం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఎన్నికల్లో ఇచ్చిన మాట ప్రకారం దశల వారీగా హామీలను ప్రభుత్వం అమలు చేస్తుందని తెలిపారు. పేదలు సన్నబియ్యంతో బువ్వ తినాలన్న లక్ష్యంతో ఉచితంగా సన్నాలు పంపిణీ చేస్తుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో మంచాల పీఏసీఎస్ చైర్మన్ హన్మంత్‌రెడ్డి, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు రాంరెడ్డి, నాయకులు రమాకాంత్‌రెడ్డి, పండరినాథ్, చంద్రయ్య, జంగయ్య, నరేందర్‌రెడ్డి, సలాం, మల్లేశ్ తదితరులు పాల్గొన్నారు.

సన్నబియ్యం పేదలకు వరం


లబ్ధిదారు ఇంట్లో సహపంక్తి భోజనం చేస్తున్న ఎమ్మెల్యే కసిరెడ్డి తదితరులు

- ప్రభుత్వ సంక్షేమ పథకాలను వినియోగించుకోండి
- ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి
- రేషన్ లబ్ధిదారు ఇంట్లో సహపంక్తి భోజనం చేసిన ఎమ్మెల్యే

కడ్తాల్: ఉచిత సన్న బియ్యం పేద ప్రజలకు వరం. పేదలు సన్న బియ్యంతో బువ్వ తినాలన్న లక్ష్యంతో ప్రభుత్వం ఆహార భద్రతా కార్డు ద్వారా లబ్ధిదారులకు సన్నాలు సరఫరా చేస్తోందని కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి అన్నారు. గురువారం మండల పరిధి కొండ్రిగానిబోడ్ తండాలో ఎమ్మెల్యే పర్యటించారు. లబ్ధిదారుడు సభావట్ జమ్రూ ఇంట్లో పార్టీ నాయకులతో కలిసి సహపంక్తి భోజనం చేశారు. అనంతరం స్థానికులతో మాట్లాడి బియ్యం ఎలా ఉన్నాయని అడగగా.. బాగున్నాయంటూ హర్షం వ్యక్తంచేశారు. 200 యూనిట్ల ఉచిత విద్యుత్, ఉచిత బస్సు సౌకర్యం, రూ.500లకే గ్యాస్ సిలిండర్ తదితర పథకాల అమలు తీరుపై ఆరా తీశారు. ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ పనులను పరిశీలించారు. లబ్ధిదారులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఇంటి నిర్మాణాలపై ఎప్పటికప్పుడు నివేదిక తయారు చేయాలని సంబంధిత అధికారులకు ఎమ్మెల్యే సూచించారు. నీటి సరఫరాలో ప్రజలకు ఇబ్బంది కలగకుండా చూడాలని, విద్యుత్ సమస్యలు తలెత్తకుండా అధికారులు అప్రమత్తంగా ఉండాలని పేర్కొన్నారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో ఎమ్మెల్యే కసిరెడ్డి మాట్లాడారు.

హామీలతో సరిపెట్టిన బీఆర్‌ఎస్

గత బీఆర్‌ఎస్ ప్రభుత్వం సన్న బియ్యం పంపిణీ చేస్తామని హామీలతో సరిపెట్టిందని ఎమ్మెల్యే కసిరెడ్డి ఆరోపించారు. కాంగ్రెస్ ఇచ్చిన మాట నిలబెట్టుకుందని పేర్కొన్నారు. పదేళ్లు రాష్ట్రాన్ని పాలించిన బీఆర్‌ఎస్.. పేదలకు ఒక్క డబుల్ బెడ్ రూం ఇల్లు కట్టించి ఇవ్వలేదని విమర్శించారు. అధికారం చేపట్టిన ఏడాదిలోనే తమ సర్కార్.. ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలు చేపట్టిందని వెల్లడించారు. హామీ మేరకు ఆరు గ్యారంటీలను క్రమంగా అమలు చేస్తుండగా.. ప్రతిపక్ష నాయకులు జీర్ణించుకోలేక కాంగ్రెస్‌పై అసత్య ప్రచారం చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తంచేశారు. ప్రభుత్వం అందజేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో పీసీసీ సభ్యుడు శ్రీనివాస్‌గౌడ్, మార్కెట్ చైర్ పర్సన్ యాటగీత, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు నర్సింహ, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు బీచ్యానాయక్, సింగిల్‌విండో డైరెక్టర్ చేగూరి వెంకటేశ్, నాయకులు బిక్కునాయక్, రాములుగౌడ్, యాదగిరిరెడ్డి, షాబుద్దీన్, రాజేశ్, నరేశ్, సేవ్యా, సత్యం, రవి, రమేశ్, భానుకిరణ్, తహసీల్దార్ ముంతాజ్, ఎంపీడీఓ సుజాత ఉన్నారు.

అనాథలకు అన్నదానం


పిల్లలకు భోజనం వడ్డిస్తున్న విష్ణువర్ధన్‌రెడ్డి

కందుకూరు: మహేశ్వరం మార్కెట్ కమిటీ డైరెక్టర్ కంబాలపల్లి విష్ణువర్ధన్‌రెడ్డి గురువారం హయత్‌నగర్‌లోని సుధీర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో కొనసాగుతున్న అనాథ శరణాలయంలో పిల్లలకు అన్నదానం చేశారు. అనాథలకు సేవ చేయడం ఎంతో సంతోషంగా ఉందని ఆయన తెలిపారు. మాజీ ఎమ్మెల్యే కేఎల్‌ఆర్‌ను స్ఫూర్తిగా తీసుకొని సేవా కార్యక్రమాల్లో పాల్గొంటున్నట్లు స్పష్టం చేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ జిల్లా జనరల్ సెక్రటరీ బొక్క భూపాల్‌రెడ్డి, సీనియర్ నాయకులు ఢిల్లీ శ్రీధర్‌ముదిరాజ్, మార్కెట్ కమిటీ డైరెక్టర్ బొమ్మకూరి ప్రశాంత్‌కుమార్, నాయకులు బూసరమోని మల్లేశ్, ఏ.మహేందర్ ఉన్నారు.